## ఎమ్మెల్సీ ఎన్నికకు జోనల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రూట్ అధికారులను, జోనల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను రూట్ ఆఫీసర్లు గానూ, జిల్లా అధికారులను జోనల్ అధికారుల గానూ నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. జోనల్ అధికారులు వెంటనే సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. మార్చి నెల 10, 11 తేదీల్లో వారి పరిధిలోనున్న పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసి 12న నివేదిక సమర్పించాలని సూచించారు. 13న ఎన్నిక నిర్వహించనున్నందున 12వ తేదీ నాటికే పోలింగ్ సిబ్బంది, మెటీరియల్ చేరుకొని పోల్ చేపట్టేలా జోనల్ అధికారులు చూడాలని ఆదేశించారు. పోలింగ్ రోజు ప్రతిగంటకూ పోల్ స్టేటస్‌పై నివేదిక సమర్పించాలని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే తగు చర్యలు తీసుకుంటూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జోనల్ అధికారులంతా శిక్షణకు హాజరై నిబంధనలను గుర్తించాలని కోరారు.

విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం

'మా ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి' అంటూ బాకాలూదుతున్న పాలకులు ఆ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో, వారికి రావాల్సిన బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. కార్పొరేషన్‌లో రెండేళ్లుగా సరెండర్ సెలవుల డబ్బులు ప్రభుత్వం నేటికీ చెల్లించలేదు. డిఎ ఎరియర్స్, ఎపిజిఎల్ఐ బకాయిలూ చెల్లించే పరిస్థితి లేదు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రావాల్సిన మొత్తాలూ కూడా చెల్లించిన దాఖలాలు లేవు. కాంట్రాక్టర్లకు అదే ఆవేదన.

# సర్కారు వారి బాకీ

- కార్పొరేషన్ ఉద్యోగులు, కార్మికుల పట్ల నిర్లక్ష్యం
- రెండేళ్లుగా రాని సరెండర్ లీవ్ బకాయిలు
- కార్మికులకు రావాల్సిందే రూ.50 లక్షలు
- డిఎ ఎరియర్స్, ఎపిజిఎల్ఐ బకాయిలదీ అదే బాట
- మరణించిన కార్మిక కుటుంబాలకు పైసా చెల్లించని ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్‌లో సుమారు 350 మంది పర్మినెంట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్క ప్రజారోగ్య విభాగంలో 190 మంది పర్మినెంట్ కార్మికులకు రావల్సినవి బకాయిలు రూ.50 లక్షలు నేటికీ ప్రభుత్వం చెల్లించలేదు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో సరెండర్ సెలవులు డబ్బులు రూ.8.72 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, కార్యాలయ సిబ్బంది, ఇతర విభాగాల్లో పని చేస్తున్న వారు సుమారుగా మరో 160 మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. వారికి సుమారుగా మరో కోటిన్నర వరకు సరెండర్ సెలవుల డబ్బులు ప్రభుత్వం చెల్లించాలి. సరెండర్ సెలవులు డబ్బులు కార్పొరేషన్‌లో రూ.2 కోట్ల వరకు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం రెండేళ్లుగా ఎప్పుడొస్తాయా? అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు తప్ప నేటికీ ప్రభుత్వం చెల్లించలేదు. వీటితోపాటు డిఎ ఎరియర్స్ ఇవ్వలేదు. ఎపిజిఎల్ఐ నుంచి రావాల్సిన డబ్బుల కోసం దరఖాస్తులు చేసుకున్నా విడుదల చేయడం లేదు. ఇఎల్ డబ్బులూ చెల్లించిన దాఖలాలు లేవు.

### అరణ్యరోదనే

కార్పొరేషన్‌లో ఇటీవల వివిధ కారణాలతో మున్సిపల్ కార్మికులు గొంప రాజేష్, సొంటేన లక్ష్మణరావు, నీలాపు వెంకటరావు, రాయి సన్యాసి, బుంగ ఆదినారాయణ, కోకిల సూర్యనారాయణ, బంగారు పరమేష్, దశమంతుల సత్తిరాజు, యలమంచిలి పైడిరాజు, ఎన్.సూర్యనారాయణ మరణించారు. కరోనా సమయంలో కొంత మంది, తర్వాత ఇంకొంతమంది మృతిచెందారు. నేటికీ వారికి ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం చెల్లించలేదు. వారి కుటుంబసభ్యులు రోజూ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు 'రేపు.. ఎల్లుండు..' అంటూ దాట వేస్తూ వస్తున్నారు తప్ప నేటికీ డబ్బులు చెల్లించలేదు.

### విద్యుత్తు బకాయిలు రూ.2.65 కోట్లు

కార్పొరేషన్ నుంచి విద్యుత్తు శాఖకు చెల్లించాల్సిన కరెంట్ బిల్లు పెరుగుతూ పోతుంది. రూ.2.65 కోట్లు మేర బిల్లుల బకాయి చెల్లించాల్సి ఉంది. దీంతో విద్యుత్తు శాఖ అధికారులు బకాయిలు చెల్లించాలని నోటీసులు మీద నోటీసులు నగరపాలక సంస్థకు జారీ చేస్తున్నారు.

### 3 నెలలుగా అందని హెల్త్ అలవెన్సులు బకాయిలు

కార్పొరేషన్‌లో సుమారు 250 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి హెల్త్ అలవెన్సులు బకాయిలు మూడు నెలలపాటు చెల్లించాలి. ప్రతి నెలా హెల్త్ అలవెన్సు కింద రూ.6500 చొప్పున ఒక్కొక్కరికి చెల్లించాల్సి ఉంది. బకాయిలపై ఎన్నిసార్లు కార్మిక సంఘాల నాయకులు విన్నవించుకున్నా విడుదల చేయలేదు.

### రూ.11.87 కోట్లకు కాంట్రాక్టర్ల బిల్లులు

నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేయించుకుంటున్న కార్పొరేషన్ నుంచి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకు పోతున్నాయి. గత జూన్ నుంచి నేటి వరకు పైసా కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఆ బిల్లులు మొత్తం రూ.11.87 కోట్లకు చేరింది. ఈ బిల్లులు ఎప్పుడు వస్తాయో? తెలియని అయోమయంలో కాంట్రాక్టర్లు ఉన్నారు. దీంతో కొత్త పనులు చేయాలన్నా, టెండర్లు వేయాలన్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్లకు డబ్బులు అప్పుగా ఇచ్చి మరీ పనులు చేయించుకోవాల్సిన దుస్థితి కార్పొరేషన్‌లో ఏర్పడింది. ఈ ఆర్థిక ఇబ్బందుల నుంచి అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఎప్పటికి బయట పడతారో వేచి చూడాల్సిందే.

# విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి

- ప్రతిరోజూ ట్యాబ్‌లను బడికి తేవాలి : కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- జొన్నవలస ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వడం ద్వారా వారి భవిష్యత్తుకు ఒక మార్గం చూపాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. విజయనగరం మండలం జొన్నవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను కలెక్టర్ సూర్యకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది, ఎనిమిది, ఏడు తరగతులను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసనా స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులు సాధించిన మార్కులు, వారి లక్ష్యాలపై ప్రశ్నించారు. ఎనిమిదో తరగతి నుంచి ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. బైజూస్ కంటెంట్ ద్వారా జరుగుతున్న పాఠ్యాంశాల బోధన, పరీక్షలపై ఆరాతీశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, ఆహార పదార్థాలను రుచిచూశారు. సఖి గ్రూపులపై దృష్టిపెట్టి వివిధ అంశాలను విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులను, వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

### పాఠాల పునశ్చరణ ఎంతో ముఖ్యం

నేర్చుకున్న పాఠ్యాంశాలను పదేపదే పునశ్చరణ చేయడం చాలా ముఖ్యమని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. రెండుమూడు సార్లు పాఠాలను బాగా చదివినప్పుడే, అంశాలు గుర్తుంటాయని చెప్పారు. ప్రతీ సబ్జెక్టులో కనీసం 90 శాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. చిన్నచిన్న ఆంగ్ల కథల పుస్తకాలు, ఆంగ్ల దినపత్రికలను చదవాలని సూచించారు. రోజూ కొద్దిపాటి సమయం లైబ్రరీలో గడపాలన్నారు. ప్రతిరోజూ ట్యాబ్‌లను బడికి తేవాలని 8వ తరగతి విద్యార్థులకు సూచించారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

### ఓటుకు ఆధార్‌ను అనుసంధానించాలి

ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని బిఎల్‌ఒలను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో ఓటర్ల సవరణ ప్రక్రియ, ఆధార్ అనుసంధానం, కొత్త ఓటర్ల నమోదు, ఎంఎల్‌సి ఓటర్ల చేర్పింపుపై బిఎల్‌ఒలను ప్రశ్నించారు. ఈ పర్యటనలో ఎంఇఒ విజయలక్ష్మి, పాఠశాల హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# శివరాత్రికి 500 ప్రత్యేక బస్సులు

### ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహా శివరాత్రి పండుగ పురస్కరించుకొని జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. బుధవారం ఆమె కొండవెలగాడలోని తన స్వగృహంలో మాట్లాడుతూ జోన్ పరిధిలో 5 జిల్లాలకు గాను ఆయా జిల్లాల్లో పండగ నిమిత్తం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు.

విజయనగరం జిల్లాకు 80 బస్సులు, విశాఖపట్నం జిల్లాకు 150 బస్సులు, అనకాపల్లికి 110 బస్సులు, పార్వతీపురం మన్యం జిల్లాకు 70 బస్సులు, శ్రీకాకుళం జిల్లాకు 90 బస్సులు ప్రత్యేక సాధారణ ఛార్జీలతో నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శైవ క్షేత్రాలను దర్శించుకోవాలని కోరారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగకు జోనల్ పరిధిలో మంచి ఆదాయం తెచ్చేలా కృషి చేసిన ఆర్‌టిసి అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు రావాల్సిన అలవెన్స్, ఎరియల్స్ బకాయిలు అన్నిటిని ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దశగా తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

**శృంగవరపుకోట :** మహా శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 18న పుణ్యగిరికి, సన్యాసయ్యపాలేనికి ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఈ నెల 18న పగలు 20 బస్సులు, రాత్రి 4 బస్సులు, 19న 15 ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహాశివరాత్రి రాత్రి జాగరణ సందర్భంగా ఆరోజు రాత్రి నుండి మరుసటి రోజు సాయంత్రం వరకు డిపో నుండి పుణ్యగిరికి, సన్యాసయ్యపాలేనికి బస్సులు నడుపుతున్నామని వివరించారు. మొత్తం 39 బస్సులను డిపో నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు బయల్దేరుతుందని తెలిపారు.

## అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై మండలంలోని జొన్నవలసలో ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహనరావు బుధవారం విచారణ చేపట్టారు. జొన్నవలసలో పాఠశాలకు కేటాయించిన ఆటస్థలంలో అక్రమంగా బోర్డులు పాతుతున్నారని, దీనిపై తాను ప్రశ్నించినందుకు పూసపాటి అప్పలరాజు, పిజెజె దేవవర్మ కులం పేరుతో దూషించి, చంపేస్తామని బెదిరించారని మాలమహానాడు నియోజకవర్గ కన్వీనర్ కోరాడ నారాయణరావు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈ నెల 13న అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం సంఘటన స్థలానికి డిఎస్‌పి చేరుకుని, బాధితుడు నారాయణరావు, స్థానికులను విచారించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీసు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో గురువారం నిర్వహించాల్సిన జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మార్చి నెల చివరి వారంలో జరుగుతుందని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

## ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పక్కాగా ఏర్పాట్లు

### డిఆర్ఒ గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డిఆర్ఒ ఎం.గణపతిరావు అధికారులను ఆదేశించారు. బుధవారం అయన ఛాంబర్‌లో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 20 నుండి మార్చి ఏడో తేది వరకు, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26 నుండి మార్చి ఏడో తేది వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 97 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అవాంతరాలు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని చెప్పారు. 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. పరీక్ష సమయాలలో విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా బస్సులను అన్ని రూట్లలో నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు.

ఆర్ఐఒ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పరీక్షల కోసం 3 ఫ్లయింగ్ స్క్వాడ్లను , జిల్లాలో 7 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమాచారం కోసం 08922-237988 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో పోలీస్, ఆర్‌టిసి, విద్యుత్ శాఖల అధికారులు, పరీక్షల కమిటీ సభ్యులు ఎం.ఆదినారాయణ, ప్రిన్సిపల్స్ జగన్నాథరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో గత మూడు రోజులుగా జరుతున్న అంతర్ జిల్లాల అర్చరీ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీల్లో గెలుపొందిన విజేతలకు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో పాల్గొనటం సంతోషదాయకం అన్నారు. విజేతలు రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏ పోటీల్లోనైనా గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహపడకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగితే భవిష్యత్‌లో విజయాలను సొంతం చేసుకుంటారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు.

ఈ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బి.గాయత్రివల్లి మొదటి స్థానం కైవసం చేసుకోగా, చిత్తూరు జిల్లాకు చెందిన కె.సాయి సుజయ, డి.గీతికా రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఇ.శివదుర్గ నాల్గవ స్థానం దక్కించుకున్నారు. అండర్-14 బాలుర విభాగంలో మొదటి స్థానం విశాఖకు చెందిన ఎస్.రామ్ చైతన్య దక్కించుకోగా, ద్వితీయస్థానంలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన జి. వెంకటలోకేశ్, తృతీయ స్థానంలో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన వై.నవనీష్, నాల్గవ స్థానంలో చిత్తూరు జిల్లాకు చెందిన వై. ధీమంత్ ప్రసాద్ దక్కించుకున్నారు.

అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానం చిత్తూరు జిల్లాకు చెందిన ఎం.సంజన, ద్వితీయ స్థానంలో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన కె.దీపికా, తృతీయ స్థానంలో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన టి.తీర్థప్రియ, నాల్గవ స్థానంలోనూ విజయనగరం జిల్లాకు చెందిన జి.లహరి విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విశాఖజిల్లాకు చెందిన ఆర్.నాగేంద్రబాబు నాయక్, ద్వితీయ స్థానంలో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన జి.భాస్కర్, తృతీయ స్థానంలో పివిఎన్‌కె భరత్ చిత్తూరు జిల్లా, నాల్గవ స్థానంలో విశాఖ జిల్లాకు చెందిన కె.భరత్ తేజ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డివి రమణ, క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.వెంకటరమణ, గాంధీ, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల్లో విజేతలతో జెసి ఆనంద్

సిఐటియులో చేరిన కార్మికులతో నాయకులు కె.సురేష్, రెడ్డి శంకరరావు

# సిఐటియులోకి 30 మంది ఆటో కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని రాజీవ్ నగర్ కూడలి కాళీమాతా ఆలయం వద్ద 30 మంది ఆటో కార్మికులు సిఐటియులో చేరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, శ్రీ కనకదుర్గ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు సమక్షంలో వీరంతా బుధవారం యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా అక్కడ సిఐటియు జెండాను రెడ్డి శంకరరావు ఎగురవేసి స్టాండ్‌ను ప్రారంభించారు. అనంతరం సురేష్, శంకరరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక రోడ్ రవాణా చట్టంలో మార్పులు తెచ్చి ఆటో కార్మికులకు ఉరితాడు బిగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టిలోకి తేకుండా బిజెపి ప్రభుత్వం నాటకమాడుతోందని ధ్వజమెత్తారు. ఇ-చలానా పేరుతో ఆటో కార్మికులపై విపరీతంగా కేసులు రాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి రోడ్ రవాణా చట్టంలో మార్పులు రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ ఐదో తేదిన చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు జగన్‌మోహన్, పెయింటర్ల సంఘం అధ్యక్షులు కంది త్రినాధ్, స్టాండ్ ప్రెసిడెంట్, నాయకులు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# దేశినాయుడు కుటుంబానికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చెల్లింపేటలో ఏనుగుల దాడిలో మృతి చెందిన అడపా దేశినాయుడు కుటుంబాన్ని సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ గత ఏడేళ్ల నుంచి మన్యం జిల్లాలో ఏనుగులు తిరుగుతూ ప్రజల ప్రాణాలు తీస్తూ, పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు ఏనుగుల గుంపును జూకు గానీ, అడవికి గానీ తరలించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఏనుగుల దాడిలో ఎవరైనా మరణించినప్పుడు, పంట నష్టం జరిగినప్పుడు అధికారులు, నాయకులు హడావిడి చేస్తున్నారే తప్ప, ఆ తర్వాత ఏమీ పట్టించుకోవడంలేదని అన్నారు. మృతి చెందిన దేశినాయుడుతో పాటు కొమరాడ, జియ్యమ్మవలస, భామిని, కురుపాం ప్రాంతాల్లో ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టం కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఏనుగులను అడవికైనా, జూకైనా తరలించాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు వి.సత్యంనాయుడు, జి.సత్యనారాయణ, గంట్యాడ బలరాంనాయుడు, పారినాయుడు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జనసేన నాయకులు సోమనాయుడు తదితరులు ఉన్నారు.

# పన్నుల వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2022 - 23 ఆర్థిక సంవత్సరానికి గాను బకాయిలున్న ఆస్తి, నీరు, విఎల్‌టి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులను సహాయ కమిషనర్ ప్రసాదరావు ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలు తీరుపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా పన్నుల వసూళ్ల తీరును గమనించి, వివరణ కోరారు. మొండి బకాయిలను వసూలు చేయాలని, లేకుంటే తీసుకోబోయే చర్యలను పన్ను చెల్లింపుదారులకు వివరించాలని చెప్పాలన్నారు. నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. ఇప్పటివరకు పన్ను బకాయిదారులకు ఇచ్చిన నోటీసులు ఎన్ని, కులాయి కనెక్షన్లను తొలగించారా? వంటి అంశాలను ప్రశ్నించారు. 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను వసూలు లక్ష్యం 43.49 కోట్లకు గాను 22.72 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు చెప్పారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడడంతో పన్ను వసూళ్ళను ముమ్మరం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. మొండి బకాయిలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలంతా సహకరించాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, సాయి ప్రసాద్, వినోద్, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్ఐసి కంటింజెంట్ ఇన్‌ఛార్జిగా హరిబాబు

ప్రజాశక్తి-డెంకాడ

జాతీయ సమగ్రత శిబిరానికి ఆంధ్రప్రదేశ్ కంటింజెంట్ ఇన్‌ఛార్జిగా లెండి కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ తమ్మినేని హరిబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం జెఎన్‌టియు-జివి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ద్వారా వచ్చిన ఉత్తర్వులను లెండి కళాశాల ప్రిన్సిపల్ వివి రామారెడ్డి.. హరిబాబుకు అందజేసి, అభినందించారు. ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఈ శిబిరానికి జెఎన్‌టియుకె, జివి నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ శిబిరంలో రాష్ట్ర సంస్కృతి, ఆచార వ్యవహారాలు, స్థితిగతులను వివరించే దిశగా తయారుచేసి, అందులో పాల్గొనేటట్లు హరిబాబు కృషి చేయనున్నారు. ఈ శిబిరం ఈ నెల 18 నుంచి 24వరకు పశ్చిమబెంగాల్లోని వర్ధమాన్ యూనివర్సిటీలో జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవ పథకం ఆధ్వర్యాన యువతను సంఘటిత పరిచే ప్రక్రియలో జాతీయ సమగ్రత శిబిరాలు దోహదపడతాయని చెప్పారు.

హరిబాబుకు నియామక ఉత్తర్వులు అందిస్తున్న ప్రిన్సిపల్ రామారెడ్డి

మేనేజర్‌ను సత్కరిస్తున్న అధికారులు

## ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్‌కు సన్మానం

**నెల్లిమర్ల :** మండలంలోని సతివాడ గ్రామీణ బ్యాంకు మేనేజర్ షణ్ముఖరావుకు బుధవారం స్థానిక స్టేట్ బ్యాంకులో సన్మానం జరిగింది. ఎస్‌బిఐ ఎల్‌డిఎం శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్ర వర్తి, మెప్మా పీడీ బి. సుధాకర రావు చేతుల మీదగా సత్కరించారు. సన్మాన గ్రహీత షణ్ముఖరావు స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వడం వసూళ్ల చేయడంలో ప్రతిభ కనబర్చినందుకు ఈ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ జి.సీతారామయ్య, బ్యాంకు లింకేజ్ డిపిఎం బంగారమ్మ, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం ఎల్. సత్య నారాయణ, గుర్ల, నెల్లిమర్ల మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లు, సిసిలు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**వేపాడ :** మండలంలోని సోంపురం గ్రామంలో చేపడుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పట్నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్ సీట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది వేషవి కాలం కావడంతో పనిచేసే చోట కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

## పాఠశాల పరిశీలన

**వేపాడ :** మండలంలోని పెదగుడిపాల ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. శ్రీదేవి బుధవారం పరిశీలిం చారు. ఇందులో భాగంగా తొలుత పాఠశాల రికార్డు లన ఆమె తనిఖీ చేశార. అనంతరం విద్యార్థులకు ఇస్తున్న ఎండిఎంను పరిశీలించారు. పాఠశాల ఆవరణ పరిశ్రమ పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా పచ్చని మొక్కలను కూడా పెంచడానికి చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న గొంప కృష్ణ, తదితరులు

## గొంప కృష్ణ ప్రత్యేక పూజలు

**వేపాడ:** మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఇంటమ్మ తల్లికి టిడిపి నియోజకవర్గ నాయకుల గొంప కృష్ణ మంగళవారం రాత్రి మొక్కుల తీర్చుకున్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో నాయకుల గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, తాడి కృష్ణ, సేనాపతి అప్పారావు, మిడతాన జోగినాయుడు తదితరులు పాల్గొని మొక్కుల తీర్చుకున్నారు.

## 18న ఆనందోబ్రహ్మ

**బొబ్బిలి :** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 18న కళాభారతి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు ఎం. విజయ మోహన్ రావు తెలిపారు. కళాభారతి ఆడిటోరియం ప్రాంగణంలో బుధవారం ఉదయం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సకల కళల ఆనందోబ్రహ్మ ప్రదర్శనలో భాగంగా శివ రాత్రి పర్వదినం కోసం ప్రత్యేక ప్రదర్శనలు ఉన్నాయని తెలిపారు. ఔత్సాహిక కళాకారులతో మూడు గంటలసేపు నిర్వహిస్తున్న ఈ తొమ్మిదవ ప్రదర్శనకు ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకే ప్రేక్షకులు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేవలం 10 రూపాయల టికెట్ కొని కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు రాముద్రి గోవిందరావు, తాడుతూరి వెంకటరమణ, వై మోజేష్, కృష్ణ దాస్ మాస్టారు పాల్గొన్నారు.

## జగనాసుర రక్తచరిత్ర పుస్తకావిష్కరణ

**బొబ్బిలి :** జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని కోటలో టిడిపి నాయకులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అల్లాడ భాస్కరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సొంత బాబాయ్‌ను చంపించేసారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేశారు. సొంత బాబాయ్ హత్యకు గురైనప్పటికి అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ఎందుకు సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హత్యతో సంబంధం ఉండడం వల్లనే దర్యాప్తు ముందుకు సాగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 17న వాహనాల వేలం

**రామభద్రపురం :** వివిధ కేసుల్లో పట్టుబడి స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసి భద్రపరచిన వాహనాలకు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు స్టేషన్ వద్ద వేలం వేసి విక్రయించనున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. గతంలో ఈ వాహనాలకు వేలం పాట నిర్వహించినప్పటికీ తగిన మూల్యం రాకపోవడంతో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు మరలా వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలంలో ఆటోతో పాటు 9 ద్విచక్ర వాహనాలు ఉన్నాయన్నారు. వాహనాలు కావాలసిన ఎవరైనా ఈ వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

**కొత్తవలస :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. భీమ శంకరరావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. శ్రీరాములు ఆధ్వర్యంలో చింతలదిమ్మ గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం రోడ్డు వేశారు. కొంతకాలంగా పాడైన రోడ్డు పనులు, మంచినీటి కొళాయిలు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మరమ్మతులు చేపట్టి అందరి మన్ననలు పొందారు. కళాశాల ఎన్ఎస్-ఎస్ విద్యార్థులు చేసిన పనులను గ్రామస్తులు అభినందించారు.

## నవధాన్యాలపై రైతులకు అవగాహన

**బాడంగి:** మండలంలోని తెంటువలసలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంధి ఆధ్వర్యంలో రైతులకు ప్రకతి వ్యవసాయ పద్ధతులలో నవధాన్యాల పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రైతులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మాస్టర్ ట్రైయినర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం ఆపేసి అందరూ రైతులు తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆరోగ్య కరమైన పంటలు పండించాలన్నారు. ఎక్కువ దిగుబడులు సాధించాలని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించి మన గ్రామాన్ని బయో విలేజ్‌గగా చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఎఎ శరత్ చంద్ర, యూనిట్ ఇంఛార్జి వై. ఈశ్వరరావు, ఆర్.రమణ, జి.సన్యాసి నాయుడు, అప్పలనాయుడు ఐసిఆర్‌పి నారాయణమ్మ, ఎం.చైతన్య, భారతి, రైతులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపిపి విరాళం

విరాళం అందిస్తున్న కంది చంద్రశేఖర్

**నెల్లిమర్ల :** మండలంలోని అలుగోలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పైడిమారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి డెంకాడ మాజీ ఎంపిపి, టిడిపి నియోజకవర్గం సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు రూ. 30వేల విరాళాన్ని బుధారం ఆ గ్రామంలో అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సిహెచ్‌సి చైర్మన్ పతివాడ తమ్మినాయుడు, విజయనగరం పార్లమెంటరీ అధికార ప్రతినిధి గేదల రాజారావు, టిడిపి ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తంగుడపల్లి ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, నాయకులు ఆల్తి బాబురావు, తాడ్డి సత్యనారాయణ, కెల్ల నారాయణప్పడు, కొంచాడ గొల్ల బాబు, కెల్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# దన్నానపేటలో అపారిశుధ్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని దన్నాన పేట గ్రామంలో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వీధి కాలువలు పూడికతో పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలకు ఒకసారైనా కాలువలు శుభ్రం చేయలేదని దోమలు, ఈగలు వాలి ఆహార పదార్థాలను కలుషితం చేయడం వల్ల వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తుల వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో కాలువలు శుభ్రం చేయక పోతే వర్షాకాలం మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా కాలువలు శుభ్రం చేయాలని అడిగితే కనీసం పట్టించుకోలేదని అంటున్నారు. గ్రామానికి వెళ్లే రహదారిలో ఊరు ముందే డంపింగ్ యార్డును తలపించేలా చెత్త దర్శనమివ్వడంతో

ఆక్రమణకు గురైన బావి స్థలం ఇదే

ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న తాగు నీటి బావిని ఆక్రమించుకున్న పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే బావిపై గతంలో ఫిర్యాదు చేస్తే కొన్నాళ్ళ పాటు ఆక్రమణ నిలుపుదల చేసినా మళ్లీ ఇప్పుడ ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని, తాగునీటి బావిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన మురుగు

## లిప్ బృందం పరిశీలన

**వేపాడ :** మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ పోగ్రామ్ టీమ్ బృందం (లిప్) బుధవారం సందర్శించింది. భీమునిపట్నం డైట్ ప్రిన్సిపల్ మాణిక్యం నాయుడు 6,7,8 తరగతుల పిల్లలను పరిశీలించి వారి విద్యా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఎల్ కోట ఎంఇఒ కూర్మారావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పి. బాల భాస్కరరావు, సిఆర్‌పి కె రాంప్రసాద్ పాల్గొన్నారు

విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

## బిజెపి దుర్మార్గాలను ఖండించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

త్రిపుర రాష్ట్రంలో ఈ నెల 16న రాష్ట్ర ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార బిజెపి కార్మిక సంఘ కార్యాలయాలు, వామపక్ష కార్యాలయాలు ధ్వంసం చేస్తూ ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు అవకాశం లేకుండా భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు కోరారు. ఈ మేరకు బుధవారం ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్‌లో బిజెపి తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల నుండి పోలీసులను రప్పించి అనేక రకాల అరాచకాలను సృష్టిస్తున్నారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా నాయకులు మునకాల శ్రీనివాసరావు, కోట అప్పన్న మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించే పార్టీలు సంస్థలు వ్యక్తులను టార్గెట్ చేసి అణగదొక్కుతున్నారని పచ్చి నియంతల పరిపాలన చేస్తున్నారని

నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మోడీ వేలాది మందిని ఊచకోత కోసి మత విద్వేషాన్ని రెచ్చగొట్టి చంపిన దుర్మార్గాన్ని బిబిసి వార్తా సంస్థ బయట పెడితే ఆ సంస్థ మీద కూడా ఈడీ దాడులు చేయిస్తుందని అన్నారు. ప్రజలు బిజెపిని పాతి పెట్టడానికి సిద్ధం కావాలని బిజెపికి అంటకాగే పార్టీలు దూరంగా ఉండకపోతే వారికి సరైన గుణపాఠం ప్రజలు చెప్పాలని కోరారు

## ముఖ హాజరు రద్దుచేయాలని ధర్నా

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ముఖ హాజరు రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ముఖ హాజరు యాప్ రద్దు చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ముఖ హాజరు పెట్టడం అన్యాయమన్నారు. ముఖ హాజరు పెట్టడంతో చదువు రాని నిరాక్షరాస్యులైన కార్మికులు ముఖ హాజరు ఎలా వేసుకుంటారని ప్రశ్నించారు. ముఖ హాజరు రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు,

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్మికులకు సబ్బులు, యూనిఫామ్, కొబ్బరి నూనె, చెప్పులు పంపిణీ చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగు ణంగా కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా పూర్ణ కుంభాభిషేకం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెంలో కొలువైన సీతారామ చంద్రస్వామీ ఆలయ 21వ (ఏకవింశతి) వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకుని గురుదేవా చారిటబుల్ ట్రస్టు, సీతారామ ఆలయ కమిటీ, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన మహా పూర్ణ కుంభాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర్ ప్రధాన అర్చకులు సత్యేంద్ర కుమార్ దాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు

పూర్ణ కుంభాభిషేకంలో పాల్గొన్న వేద పండితులు

పాల్గొని 2వేల కళశాలతో పవిత్ర గంగా జలాభిషేకం శిఖరాం పై నుంచి నిర్వహించడం అదృష్టంగా భావించారు. భూరెలు, రేగుపల్లు తదితరాలతో స్వామివారిని సేవించారు. 30 మంది వేద పండితులచే శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, ద్విసహస్ర కలశ స్నపనం, కుంభాభిషేకం, కుంభప్రోక్షణ, విశేష అలంకరణ, లక్షతులసి అర్చన వంటి విశేష కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున తీర్థ ప్రసాదాలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు ఆధ్వర్యంలో 10వేల మంది భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. అరకు, డుబ్రిగూడ, బొర్రా, పాడువా, పాడేరు, బేజా, కోరాపుట్ తదితర ప్రాంతాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు, గౌరీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ రశీదు తప్పనిసరి

**జామి :** యల్లారమ్మ జాతరకు సంబంధించి పండుగ వసూళ్లకు దేవాదాయ శాఖ రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, అనధికార వసూళ్ల జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ హేమంత్ కుమార్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా గతంలో జరిగిన ఉత్సవ ఏర్పాట్లును సమీక్షించడంతో పాటు అదనంగా వివిధ శాఖల అభ్యర్థనల, సూచనలను సమావేశంలో దేవాదాయ శాఖ ఇఒ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సంధ్భంగా పలు అంశాలను పాటించవలసిందిగా ఎగ్జిక్యూటివ్ ఆధికారికి సూచించారు. ప్రధానంగా ఉచిత దర్శనం క్యూలైను ఏర్పాటు చేయాలని, ఎండ తీవ్రత వల్ల భక్తులు ఇబ్బంది లకు గురి కాకుండా క్యూలైన్లు ఏర్పాటు ప్రాంతంలో గతం కంటే అధికంగా టెంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అనధికార ముద్రణ అరికట్టడానికి గాను విఐపి పాసులు విధిగా దేవాదాయ శాఖ ఇఒ సంతకంతోనే సరఫరా చేయాలన్నారు. అటువంటి వాటిని మాత్రమే పోలీసు శాఖ వారు అనుమతించాలని

అధికారులకు పలు సూచనలు చేస్తున్న తహశీల్దార్

నిర్ణయించారు. ఎన్ని పాస్‌లు ముద్రించారనే సమాచారం ముందుగ పోలీసు శాఖకు తెలియపరచాలన్నారు. ఆలయ ప్రాంగణంలో మందు గుండు సామగ్రి పేల్చే ప్రాంతంలో అగ్నిప్రమాద వాహనాలు ఏర్పాటు చేయాలని, జాతరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఊరేగింపు జరిగే ప్రాంతంలో అదనంగా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సతీష్, ఎస్.కోట సిఐ సింహాద్రి నాయుడు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం

ప్రజాశక్తి- బొబ్బిలి

రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం చేస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రౌతు రామమూర్తి, రెడ్డి కృష్ణమూర్తినాయుడు అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బుధవారం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమవుతున్నార న్నారు. పెన్షన్స్ ప్రతినెల ఒకటి నాటికి జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రతినెల ఒకటికే పెన్షన్స్ చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక**

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రౌతు రామమూర్తి, రెడ్డి కృష్ణమూర్తినాయుడు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎల్.జగన్నాథం,

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

సిహెచ్ వెంకటరావు, ఉపాధ్యక్షులుగా పి.సత్యంనాయుడు, కె. బలరాం, వి.శ్రీరామ్మూర్తి, కె. సత్యరాజు, ఆర్.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా జి.ఆదినారాయణ, బి.పారినాయుడు, జి.కృష్ణమూర్తి, ఎన్. అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె. తవిటయ్య, ఇ.నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎల్ సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పప్పుల చీటీ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పప్పుల చీటీ బాధితులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ పప్పుల చీటీ కుంభకోణం జరిగి నెలలు గడుస్తున్నా బాధితులకు ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. ముఖ్యంగా పప్పుల చీటీ నిందితులను పోలీసులు అరెస్టు చేశామని చేతులు దులుపుకున్నారు గాని డబ్బులు ఇచ్చిన బాధితులు, ఏజెంట్లకు న్యాయం చేయలేక పోయారన్నారు. ఇప్పటికీ పప్పుల చీటీ బాధితులు ఏజెంట్లు వద్దకు వెళ్లి వారిని నిలదీస్తున్నారని దీనివల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. ఇంతా జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, అధికార్లు జోక్యం చేసుకుని నిందతులు కాజేసిన కోట్లాది రూపాయలు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని బాధితులు, ఏజెంట్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పప్పుల చీటీ బాధితులు, ఏజెంట్లకు న్యాయం జరగక పోతే ఆందోళన, ధర్నాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కిల్లంపల్లి రామారావు

## చిన్నారిని ఆర్థికంగా ఆదుకోరూ..

ప్రజాశక్తి- నెల్లిమర్ల

తంగుడుబిల్లి గ్రామానికి చెందిన పొదిలాపు శ్రీను, భారతి దంపతుల రెండో కుమారుడు పొదిలాపు హేమచరణ్ (12) గత కొన్ని నెలలుగా అరుదైన మెదడు వ్యాధితో బాధపడుతున్నాడు. మెదడలోని ఒక నరం ఉబ్బిపోవడం వల్ల కొన్ని నరాలు చిన్న మెదడు దగ్గరలో పోగులా చేరిపోయాయి. దీంతో తరుచుగా కళ్ళు తిరిగి పడిపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించగా అరుదైన వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. దీనికి బెంగుళూరులోని నిమ్‌హాన్స్ ఆస్పత్రిలో మెదడుకు సంబంధించి 3 ఆపరేషన్లు చేయాలని ఒక్కో ఆపరేషన్‌కు రూ. 15లక్షలు వరకూ ఖర్చవుతోందని చెప్పారు. ఇప్పటికే 2 ఆపరేషన్లు పూర్తి చేసిన తల్లిదండ్రులు మూడో ఆపరేషన్‌కు డబ్బులు లేక తల్లడిల్లిపోతున్నారు. కాగా ఆపరేషన్‌కు ఈ నెల 24న బెంగుళూరు వెళ్లనున్నారు. దాతలు సహకరించి ఆర్థిక సాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాల్సిన వారు 6305042755, 9912678480 నెంబర్లను సంప్రదించాలన్నారు.

హేమచరణ్

## పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలుండాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తహశీల్దార్ శ్రీనివాసరావు ఆదేశించారు. పెట్రోల్ బంక్ ఇన్‌స్పెక్షన్ కార్యక్రమంలో భాగంగాగ బుధవారం పట్టణంలోని లక్ష్మీ శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంకులో ఆయనతో పాటు సివిల్ సప్లయ్ డిటి మూర్తి తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బంకులో నాణ్యత ప్రమాణాలను, బంకులో వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరిశీలించిన వివరాలన్నీ ప్రభుత్వ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు బంకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వినియోగదారులకు అన్ని సౌకర్యాలూ అందుబాటులో ఉంచాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బంకులో తనిఖీలు చేస్తున్న అధికారులు

బెంచీలను ఏర్పాటు చేస్తున్న ట్రస్టు సభ్యులు

## బెంచీలు ఏర్పాటు

**వేపాడ :** పైడిమాంబ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు ఇచ్చిన బెంచ్‌లను బధవారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దబ్బిరాజు చెరువు గట్టు పై పాద చారుల సౌకర్యార్థం - 6, వేపాడ కెజిబివి పాఠశాల వద్ద 2, ఏర్పాటు చేశారు. ఈ బెంచ్‌లను మండలానికి చెందిన తాడి రాంబాబు, సేనాపతి గణేష్, సేనాపతి సత్యారావు, నున్న గొప్పుల వెంకట్రావు, చింతల సాయి, మంచిన సన్యాసి రావు, సింగిడి బ్రదర్స్ అందజేసినట్లు నిర్వాహుకులు తెలిపారు.

## అధ్వానంగా రహదారి

**వేపాడ :** మండలంలోని వల్లంపూడి- వేపాడ గ్రామాల మధ్యన ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారైంది. రోడ్డు మొత్తం గోతులు కావడంతో వాటిలోకి గ్రామాల్లోని వాడుక నీరు చేరి రోడ్డు మురుగు కాలువను తలపిస్తుంది. నిత్యం రద్దీగా క్వారీ లారీలు, బడి బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే పిల్లలు సైకిళ్ళు ప్రయాణం సాగిస్తున్న సమయంలో ఎదురెదురుగా వచ్చేటప్పుడు గోతులు కారణంగా తప్పించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి గోతులు పూడ్చి ప్రయాణికుల పడుతున్న ఇబ్బందులను తొలగిస్తారని కోరుతున్నారు.

గోతులమయమైన రహదారి

## కొండ ఆక్రమణ

ఆక్రమణకు గురవుతున్న కొండ ఇదే

**గుర్ల :** మండలంలో పొలాయవలస గ్రామం రెవెన్యూ పరిధిలో ఉన్న చిన్నమెట్ట కొండప్రాంతాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకులు అండదండలతో ఆక్రమించేస్తున్నారని చెబుతున్నారు. సుమారు ఇరవై ఎకరాల భూమిని ఆక్రమించి సాగుచేసేందుకు కొండను చదును చేస్తున్నారు. భూ ఆక్రమణల పై తహశీల్దార్‌ని వివరణ కోరగా వాటి పై పూర్తి విచారణ జరిపించాలని స్థానిక విఆర్ఒకు ఆదేశాలు జరిచేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసికోవడం జరుగుతుందన్నారు.

## మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి

**రేగిడి:** మండలంలోని పనసలవలస, మునకలవలస, కొర్లవలస, కోడిస తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ అధికారులు మొక్కజొన్న పంటల విత్తనాలకు రాయితీ కల్పిస్తుండటంతో పాటు క్వింటాకు మంచి ధర ఉండటంతో రైతులు ఈ పంటలపై మొగ్గు చూపుతున్నారు. మండలంలోని 4,272 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు పండిస్తున్నట్లు వ్యవసాయ అధికారి గిరడ మురళీ కృష్ణ తెలిపారు. ఈ పంటలు మరింత విస్తరణ పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మొక్క జొన్న పంట

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

### ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని అచ్చుతాపురం వద్ద టాటా మేజిక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందగా ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు మేరకు బుధవారం పాలకొండ దగ్గర కొత్తూరు గ్రామానికి చెందిన పొట్నూరు చంద్ర శేకర్, సీతమ్మ భార్య భర్తలు చీపురుపల్లిలో బస్సు దిగి అక్కడ నుండి విజయనగరం వెళ్ళడానికి చీపురుపల్లిలో టాటా మేజిక్ ఎక్కారు. వీరితో పాటుగా రేగిడి మండలం బురాడ గ్రామానికి చెందిన కొంతమంది ఎక్కారు. అచ్చుతాపురం సెంటర్ తరువాత చింత చెట్టులు వద్దకు వెళ్లేసరికి టాటా మేజిక్ అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పొట్నూరు చంద్రశేఖర్ (47) ప్రయాణిస్తున్న వాహనంలోనే మృతి చెందారు. మృతుని భార్య సీతమ్మ కాలు విరిగి పోయింది. అందులో ప్రయాణిస్తున్న రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన గులివిందల లక్ష్మి, గులివిందల చిలకమ్మకు తీవ్రంగా దెబ్బలు తగలడంతో 108వాహనంలో విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన గుర్ల ఎస్ఐ జి. శిరీష్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడి బాధితులతో మాట్లాడి క్షతగాత్రులను చికిత్స కోసం దగ్గరుండి ఆసుపత్రికి తరలించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీ కొన్న టాటా మేజిక్ వాహనం